

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 01-12-2025 | సంపుటి - 25 | సంచిక -194 | రూ : 4 | పేజీలు: 8



2లో

## టీజీఎస్ఆర్టీసీ..
# ప్రయాణికులకు గుడ్ న్యూస్


### 60 రోజుల ముందే టికెట్ బుకింగ్!


- పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులకు వెసులుబాటు
- ఇప్పటికే ఉన్న సదుపాయంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని నిర్ణయం
- ఏసీ, స్లీపర్ బస్సులను పెంచుతున్న ఆర్టీసీ

## తెలంగాణ
# పంచాయతీ ఎన్నికలు

### తొలి విడతకు వెల్లువెత్తిన నామినేషన్లు 2లో

- తొలి విడత పంచాయతీ ఎన్నికలకు 25 వేలకు పైగా నామినేషన్లు దాఖలు
- 4,236 గ్రామ పంచాయతీలకు కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియ
- డిసెంబర్ 11న తొలి దశ పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- మొత్తం మూడు విడతల్లో 12,728 పంచాయతీలకు ఎన్నికలు
- కేంద్ర నిధుల కోసమే ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ




2లో

## కొండగట్టులో
# భారీ అగ్నిప్రమాదం

- కొండగట్టు వద్ద గత రాత్రి భారీ అగ్నిప్రమాదం
- 32 బొమ్మల దుకాణాలు పూర్తిగా దగ్ధం
- సమ్మక్క జాతర కోసం నిల్వ ఉంచిన సరుకు బూడిద
- కోట్లాది రూపాయల ఆస్తినష్టం జరిగిందని అంచనా
- విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమని ప్రాథమిక నిర్ధారణ

## భారత క్రీడారంగానికి
# ఇది 'సూపర్ హిట్' నెల


### 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంసల వర్షం

- మహిళల క్రికెట్, కబడ్డీ ప్రపంచకప్‌ల విజయాలపై ప్రత్యేక అభినందనలు
- అంధుల మహిళా క్రికెట్ జట్టు విజయం చరిత్రలో నిలిచిపోతుందన్న ప్రధాని
- డెఫ్లింపిక్స్, వరల్డ్ బాక్సింగ్‌లోనూ పతకాల పంట పండించిన భారత


2లో

## వర్షంలోనూ తిరుమలకు
# పోటెత్తిన భక్తులు..

### సర్వదర్శనానికి 15 గంటల సమయం


2లో

- వారాంతం కావడంతో తిరుమలకు పోటెత్తిన భక్తులు
- 14 కంపార్ట్‌మెంట్లలో దర్శనం కోసం వేచి ఉన్న భక్తజనం
- దిత్వా తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షా లను లెక్కచేయని భక్తులు
- శనివారం హుండీ ఆదాయం రూ.3.73 కోట్లు

# భోగాపురం విమానాశ్రయం సిద్ధం..

### వచ్చే నెలలో ఎగరనున్న తొలి విమానం!


2లో

- టెస్ట్ ఫ్లైట్‌కు సిద్ధమవుతున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం
- డిసెంబర్ చివరిలో లేదా జనవరిలో తొలి విమానం ఎగిరే అవకాశం
- ఇప్పటికే 92 శాతానికి పైగా పూర్తయిన నిర్మాణ పనులు

## 'పేదల సేవలో' కార్యక్రమంలో
# అందరూ పాల్గొనాలి..


2లో

- నిరంతరం ప్రజల్లో ఉండాలని హితవు
- ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్న టీడీపీ అధినేత
- పింఛన్ల పంపిణీని పేదల సేవగా భావించాలన్న చంద్రబాబు

# సచిన్ రికార్డు బద్దలు కొట్టిన కోహ్లీ... గవాస్కర్ స్పందన

రాంచీ, నవంబర్ 30 : భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీ వన్డే ఫార్మాట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న అత్యధిక సెంచరీల రికార్డును అధిగమించి, ఓ ఫార్మాట్‌లో అత్యధిక శతకాలు బాదిన ఆటగాడిగా నిలిచాడు. ఆదివారం రాంచీలో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో అద్భుత శతకం బాదిన కోహ్లీ.. వన్డేల్లో తన 52వ సెంచరీని నమోదు చేశాడు. సచిన్ ఇప్పటివరకు ఓ ఫార్మాట్ లో అత్యధిక సెంచరీలు కొట్టిన ఆటగాడిగా ఉన్నాడు. సచిన్ టెస్టుల్లో 51 సెంచరీలు కొట్టాడు. తాజాగా, ఆ రికార్డును కోహ్లీ అధిగమించాడు. కోహ్లీ వన్డేల్లో 52వ సెంచరీ సాధించడంతో, ఓ సింగిల్ ఫార్మాట్ లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా అవతరించాడు. ఈ చారిత్రక ఘనతపై భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఈ మ్యాచ్ సందర్భంగా జియో స్టార్‌తో మాట్లాడిన గవాస్కర్.. వన్డేల్లో కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడని కొనియాడాడు. "విరాట్ కోహ్లీతో కలిసి ఆడిన వారు, అతనికి వ్యతిరేకంగా ఆడిన వారు.. అందరూ అతడే వన్డేల్లో గ్రేటెస్ట్ అని అంగీకరిస్తారు. రికీ పాంటింగ్ కూడా కోహ్లీని అత్యుత్తమ ఆటగాడిగా అభివర్ణించాడు. ఆస్ట్రేలియన్ల నుంచి ప్రశంసలు పొందడం చాలా కష్టం. సచిన్‌ను దాటేశాడంటే, అతని స్థానం ఏంటో అర్థం చేసుకోవచ్చు" అని గవాస్కర్ వ్యాఖ్యానించాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ 120 బంతుల్లో 135 పరుగులు చేసి భారీ ఇన్నింగ్స్ ఆడాడు. అతనికి తోడుగా రోహిత్ శర్మ, కెప్టెన్ కేఎల్ రాహుల్ అర్ధ సెంచరీలతో రాణించడంతో, భారత జట్టు దక్షిణాఫ్రికా ముందు 350 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇటీవల కాలంలో కోహ్లీ ఫామ్‌పై కొన్ని విమర్శలు వచ్చినప్పటికీ, గత నెల ఆస్ట్రేలియా పర్యటనలో రాణించి, ఇప్పుడు స్వదేశంలోనూ అదే జోరును కొనసాగించాడు. ఇప్పటికే టెస్టులు, టీ20ల నుంచి తప్పుకున్న కోహ్లీ, ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి సారించాడు. 2027 ప్రపంచకప్‌ను లక్ష్యంగా పెట్టుకుని కెరీర్‌ను ముగించాలని భావిస్తున్నాడు.

### భారత క్రీడారంగానికి ఇది 'సూపర్ హిట్' నెల

## 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంసల వర్షం

ఢిల్లీ, నవంబర్ 30 : భారత క్రీడా రంగానికి గడిచిన నెల ఒక సూపర్ హిట్ నెలగా నిలిచిపోయిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 128వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడుతూ.. పలు అంతర్జాతీయ క్రీడా పోటీలలో భారత క్రీడాకారులు సాధించిన అద్భుత విజయాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్ నుంచి కబడ్డీ, బాక్సింగ్ వరకు వివిధ రంగాల్లో మన అథ్లెట్లు దేశానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, "భారత క్రీడా రంగం పరంగా ఈ నెల ఒక సూపర్ హిట్‌గా నిలిచింది. ఐసీసీ మహిళల ప్రపంచ కప్ గెలవడంతో ఈ నెల ప్రారంభమైంది. ఆ తర్వాత కూడా క్రీడా మైదానాల్లో మన వాళ్ల జోరు కొనసాగింది. కొద్ది రోజుల క్రితం టోక్యోలో జరిగిన డెఫ్లింపిక్స్‌లో భారత క్రీడాకారులు 20 పతకాలు సాధించి, ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు" అని తెలిపారు. అంతేకాకుండా, భారత మహిళా కబడ్డీ జట్టు ప్రపంచ కప్‌ను కైవసం చేసుకోవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. టోర్నమెంట్ ఆరంభం నుంచి చివరి వరకు ఆధిపత్యం ప్రదర్శించిన మన అమ్మాయిలు, గ్రూప్ స్టేజ్‌లోని అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించారు. సెమీఫైనల్‌లో ఇరాన్‌పై 33-21 స్కోరుతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లారు. తుదిపోరులో చైనీస్ తైపీ జట్టును 35-28 తేడాతో ఓడించి విశ్వవిజేతగా నిలిచారు. "మన మహిళా క్రీడాకారులు కబడ్డీ ప్రపంచ కప్ గెలిచి చరిత్ర సృష్టించారు. టోర్నమెంట్ అంతటా వారి అద్భుతమైన ప్రదర్శన ప్రతి భారతీయుడి హృదయాన్ని గెలుచుకుంది" అని మోదీ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, గ్రేటర్ నోయిడాలో జరిగిన వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లోనూ భారత బాక్సర్లు పతకాల పంట పండించారు. ఈ టోర్నమెంట్‌లో మన క్రీడాకారులు మొత్తం 20 పతకాలు సాధించారు. ఇందులో తొమ్మిది స్వర్ణాలు, ఆరు రజతాలు, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి. అయితే, ఈ విజయాలన్నింటిలోనూ అంధుల మహిళా క్రికెట్ జట్టు సాధించిన ప్రపంచ కప్ విజయం అత్యంత ప్రత్యేకమైనదని ప్రధాని మోదీ అభివర్ణించారు. టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అజేయంగా నిలిచి కప్ గెలవడం వారి అసామాన్య ప్రతిభకు నిదర్శనమని అన్నారు. ఈ విజయం తర్వాత తాను జట్టు సభ్యులను తన నివాసంలో కలుసుకున్నానని ఆయన గుర్తుచేసుకున్నారు. "మిత్రులారా, వీటన్నింటికన్నా ఎక్కువగా మన మహిళల అంధుల క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలవడంపై చర్చ జరుగుతోంది. విశేషమేమిటంటే, ఈ టోర్నమెంట్‌లో మన జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా గెలిచింది. ఈ జట్టులోని ప్రతి క్రీడాకారిణిని చూసి దేశ ప్రజలు గర్విస్తున్నారు. కేవలం రెండు రోజుల క్రితమే నేను ఈ జట్టును ప్రధానమంత్రి నివాసంలో కలిశాను. నిజంగా, ఈ జట్టు ధైర్యం, పట్టుదల మనకు ఎంతో నేర్పుతాయి. మన క్రీడా చరిత్రలోని గొప్ప విజయాలలో ఇదొకటి. ఇది ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని ప్రధాని మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ విజయాలు భారత క్రీడాకారుల అంకితభావానికి, కఠోర శ్రమకు నిదర్శనమని ఆయన కొనియాడారు.

### తెలంగాణ పంచాయతీ ఎన్నికలు..

## తొలి విడతకు వెల్లువెత్తిన నామినేషన్లు

హైదరాబాద్, నవంబర్ 30 : తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి విడతకు నామినేషన్ల పర్వం ముగిసింది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో డిసెంబర్ 11న జరగనున్న మొదటి దశ ఎన్నికల కోసం సర్పంచ్ పదవులకు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 4,236 గ్రామ పంచాయతీలకు గాను 25,654 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నామినేషన్ల చివరి రోజైన శనివారం ఒక్కరోజే 17,940 మంది తమ పత్రాలు సమర్పించడం విశేషం. అటు వార్డు సభ్యుల స్థానాలకు కూడా తీవ్రమైన పోటీ నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 37,440 వార్డులకు 82,276 నామినేషన్లు దాఖలయ్యాయని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదివారం వెల్లడించింది. ప్రస్తుతం అధికారులు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. అర్హులైన అభ్యర్థుల జాబితాను ఆదివారం రాత్రికి ప్రకటించే అవకాశం ఉంది. నామినేషన్లపై అభ్యంతరాలను డిసెంబర్ 1న స్వీకరించి, 2వ తేదీన పరిష్కరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 4 చివరి తేదీ. షెడ్యూల్ ప్రకారం తొలి విడత పోలింగ్ డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. రాష్ట్రంలో మొత్తం 12,728 గ్రామ పంచాయతీలకు, 1,12,242 వార్డులకు మూడు దశల్లో (డిసెంబర్ 11, 14, 17) ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన రూ.3,000 కోట్ల నిధులు 2026 మార్చి 31కి ముగిసిపోనున్న నేపథ్యంలో, రాష్ట్ర కేబినెట్ ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తుది తీర్పు వచ్చిన తర్వాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై నిర్ణయం తీసుకోనున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా, బీసీలకు 17.08 శాతం రిజర్వేషన్లు కేటాయించారు.

### భోగాపురం విమానాశ్రయం సిద్ధం..

## వచ్చే నెలలో ఎగరనున్న తొలి విమానం!

భోగాపురం, నవంబర్ 30 : ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 92 శాతం పనులు పూర్తి కాగా, డిసెంబర్ చివరి వారం లేదా జనవరి మొదటి వారంలో టెస్ట్ ఫ్లైట్ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఈ ప్రాజెక్టు పనుల్లో అనూహ్యమైన వేగం కనిపిస్తోంది. ఆయన ప్రతి 15 రోజులకు ఒకసారి పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ, గడువులోగా విమానాశ్రయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. దేశంలోనే అతి పొడవైన రన్‌వేలలో ఒకటిగా నిలిచేలా 3.8 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణం దాదాపు 99 శాతం పూర్తయింది. టెర్మినల్ భవనం 90%, ఏటీసీ టవర్ 72% పనులు పూర్తి చేసుకున్నాయి. మత్స్యాకారంలో నిర్మిస్తున్న ఈ విమానాశ్రయం ఇంటీరియర్ డిజైన్‌లో ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రాజెక్టును జీఎంఆర్ సంస్థ నిర్మిస్తుండగా, ప్రస్తుతం 5,050 మంది కార్మికులు, ఇంజనీర్లు రేయింబవళ్లు పనిచేస్తున్నారు. విభజన హామీలలో భాగంగా, గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2019లో ఈ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారు. అయితే, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు మందగించాయి. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు తిరిగి ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు 'అల్లూరి సీతారామరాజు' పేరును ఖరారు చేశారు. విశాఖ పోర్టు నుంచి మూలపేట పోర్టు వరకు ప్రత్యేక కనెక్టివిటీ రహదారి, విశాఖభోగాపురం మధ్య మెట్రో రైలు మార్గం వంటి ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఈ విమానాశ్రయం పూర్తయితే ఉత్తరాంధ్ర పర్యాటక, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి కీలకంగా మారుతుందని భావిస్తున్నారు.

## 'పేదల సేవలో' కార్యక్రమంలో అందరూ పాల్గొనాలి..

అమరావతి, నవంబర్ 30 : రాజకీయ నాయకులు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండే వారే నాయకులుగా రాణిస్తారని ఆయన చెప్పారు. ఈమేరకు పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో పార్టీ నాయకులందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పింఛన్ల పంపిణీని పేదల సేవగా భావించాలని నేతలకు తెలిపారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో నాయకుల భాగస్వామ్యం ప్రస్తుతం 25 వేలకు చేరిందని చంద్రబాబు వెల్లడించారు.

### వర్షంలోనూ తిరుమలకు పోటెత్తిన భక్తులు..

## సర్వదర్శనానికి 15 గంటల సమయం

తిరుమల, నవంబర్ 30 : తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వారాంతం కావడంతో కొండపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. దిత్వా తుపాను ప్రభావంతో తిరుమలలో వర్షాలు కురుస్తున్నా, చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు 14 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు స్వామివారిని దర్శించుకునేందుకు దాదాపు 15 గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న ఒక్కరోజే 79,791 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.3.73 కోట్లుగా నమోదైందని టీటీడీ వెల్లడించింది. తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలు, చల్లని వాతావరణం ఉన్నప్పటికీ భక్తుల విశ్వాసం ముందు ఇవేవీ అడ్డంకిగా నిలవలేదు. గోవింద నామస్మరణతో క్యూలైన్లలో ఓపికగా నిరీక్షిస్తూ భక్తులు తమ భక్తిని చాటుకుంటున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పిస్తూ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.




### టీజీఎస్ఆర్టీసీ ప్రయాణికులకు గుడ్ న్యూస్..

## 60 రోజుల ముందే టికెట్ బుకింగ్!

హైదరాబాద్, నవంబర్ 30 : ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై బస్సు ప్రయాణానికి 60 రోజుల ముందుగానే టికెట్లను రిజర్వేషన్ చేసుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా పండుగలు, సెలవుల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని, ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందుగానే తమ ప్రయాణ ప్రణాళికలు వేసుకునేందుకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించింది. వాస్తవానికి ఈ 60 రోజుల ముందస్తు బుకింగ్ సదుపాయం గతంలోనూ అందుబాటులో ఉంది. అయితే దీనిపై చాలా మందికి అవగాహన లేకపోవడంతో, పండుగల సీజన్ నేపథ్యంలో దీన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇటీవలి కాలంలో టీజీఎస్ఆర్టీసీ ప్రయాణికులకు మరింత చేరువయ్యేందుకు అనేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 'గమ్యం' యాప్ ద్వారా బస్సుల లైవ్ లొకేషన్ తెలుసుకునే సదుపాయం కల్పించింది. అంతేకాకుండా, పలు ప్రధాన రూట్లలో ఏసీ, సీటర్, స్లీపర్ వంటి కొత్త సర్వీసులను కూడా అందుబాటులోకి తెచ్చింది. విమాన ప్రయాణం తరహాలోనే బస్సు బయలుదేరే సమయం, స్టాపుల వివరాలు వంటి సమాచారాన్ని ముందుగానే అందిస్తూ ప్రయాణాన్ని సులభతరం చేస్తోంది.

## కొండగట్టులో భారీ అగ్నిప్రమాదం.. కోట్లలో ఆస్తి నష్టం

జగిత్యాల, నవంబర్ 30 : జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టులో శనివారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో దాదాపు 32 బొమ్మల దుకాణాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. వ్యాపారులకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. గత రాత్రి 11 గంటల సమయంలో కొండగట్టు ఘాట్ రోడ్డులోని అభయ హనుమాన్ విగ్రహం నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న బొమ్మల దుకాణాల్లో మంటలు చెలరేగాయి. సమీపంలో జరగనున్న సమ్మక్క సారలమ్మ జాతరను దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు భారీ ఎత్తున బొమ్మలను కొనుగోలు చేసి దుకాణాల్లో నిల్వ ఉంచారు. ఒక్కో దుకాణంలో రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన సామగ్రి ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునేసరికి దుకాణాలు పూర్తిగా కాలిపోయాయి. తమ కళ్లెదుటే సర్వస్వం కాలిపోవడంతో వ్యాపారులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి రోదనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మల్యాల, ధర్మపురి సీఐలు రవి, రాంనర్సింహారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజల్లోనే ఉండండి, ప్రభుత్వ మంచిని వివరించండి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, వారి మద్దతు కూడగట్టాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వ విధానం 'పొలిటికల్ గవర్నెన్స్' అని, సంక్షేమ ఫలాలు అందించడమే కాకుండా నేతలు, కార్యకర్తలు నిరంతరం ప్రజలతో మమేకమై ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్య నేతల నుంచి బూత్ స్థాయి కార్యకర్తల వరకు అందరితో ఆయన ఆదివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలపై డిసెంబర్ నెల క్యాలెండర్‌ను విడుదల చేశారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమంపై చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ప్రతినెలా 1వ తేదీన ఎలాంటి ఆటంకం లేకుండా పెన్షన్లు అందిస్తున్నాం. కేటగిరీల వారీగా రూ.4 వేల నుంచి రూ.15 వేల వరకు అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదే. వృద్ధులకు ఏటా రూ.48 వేలు, డయాలసిస్ రోగులకు రూ.1.20 లక్షలు, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ.1.80 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందుతోంది. ఇప్పటివరకు కేవలం పెన్షన్ల కోసమే రూ.50,763 కోట్లు ఖర్చు చేశాం. ఇది దేశంలోనే అతిపెద్ద నగదు బదిలీ (డీబీటీ) కార్యక్రమం. గత 17 నెలలుగా నేనూ స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాను. ఇంత మంచి చేస్తుంటే, చేసిన మంచిని వివరంగా చెబితే ప్రజలు ఇక కూటమితోనే ఉంటారు... ఇతర పార్టీల వైపు చూడనే చూడరు" అని ఆయన స్పష్టం చేశారు. పార్టీ కోసం త్యాగాలు చేసిన కార్యకర్తలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. "పార్టీనే సర్వస్వంగా భావించి ఆస్తులు, ప్రాణాలు త్యాగం చేసిన కార్యకర్తలు ఎందరో ఉన్నారు. వారి సేవలను గుర్తిస్తున్నాం. పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చి గౌరవిస్తాం. కార్యకర్తల మనోభీష్టం మేరకే నాయకత్వం ముందుకు వెళుతుంది. మనకున్న 12 లక్షల మంది కుటుంబ సాధికార సారథులు, 46 వేల బూత్ కమిటీలు ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని ఆయన పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ వైఫల్యాలను, విధ్వంసాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. "గత పాలకుల విధ్వంసం వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. రాజకీయ కక్షతో నీరుచెట్టు, ఉపాధి హామీ బిల్లులను కూడా నిలిపేశారు.

# అయ్యప్ప మాలదారులకు నిత్య అన్న ప్రసాద వితరణ

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డు లోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో అయ్యప్ప స్వామి నిత్య అన్న ప్రసాద వితరణ 21వ రోజు నిర్వహించారు. శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప స్వామి మలాదారులకు కొమరెల్లి శివ సంతోష్ రెడ్డి సంతోషిని దంపతులు ఆదివారం నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య అన్న ప్రసాద దాతలు మాట్లాడుతూ అయ్యప్ప మాలదారులకు ప్రసాద వితరణ నిర్వహించడం తమ పూర్వ జన్మ సుకృతమని, తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అన్న ప్రసాద దాతల



కుటుంబానికి అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఏళ్ల వేళల ఉండాలని, అయురూ ఆరోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు అయ్యప్ప స్వామి ప్రసాదించాలని మనసారా అయ్యప్ప స్వామి మాలదారులు, శివదీక్ష మాలదారులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ నిర్వాహకులు తొర్పునూరి నర్సింహ గౌడ్, సన్నిధానం గురుస్వామి చెరుకు అశోక్ గౌడ్, కళ్ళెం నాగరాజు గౌడ్, చెవగోని మహేష్ గౌడ్, వరగంటి వెంకటేష్ గౌడ్, మారగోని గణేష్ గౌడ్, స్వాములు పోల్దాస్ రాజు, చెరుకు రాము గౌడ్, వంగూరి శ్రీను, దాసరి మురళిస్వామి, చెవగోని గణేష్ గౌడ్, మార్గం శేఖర్ యాదవ్, బందారపు శివగౌడ్, ఉష్కాగుల శ్రీశైలం గౌడ్, అందోజు సన్నిధ్ చారి, బొడిగె భాను గౌడ్, చెరుకు చైతన్య, చందు గౌడ్, తొర్పునూరి సాయి, తొర్పునూరి సాయిలుగౌడ్, శివ ప్రసాద్ గౌడ్, కళ్యాణ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించిన భరత్ సింహ రెడ్డి



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ సన్ రైస్ టైర్ వరల్డ్ లో ఇటీవల భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో టైర్లు, మెషినరీ పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి జరిగిన భారీ నష్టాన్ని పరిశీలించేందుకు, కార్ సెంటర్ యజమాని వెంకట్ రెడ్డి ని , అక్కడి వర్కర్స్ను కాలనీ వాసులతో కలిసి అగ్నిప్రమాదం జరిగిన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంలో కాలనీ అధ్యక్షులు నారాయణ, సతీష్ చక్రవర్తి, ఉమాపతి, వెంకట్ రెడ్డి, ఎం.ఎన్.రెడ్డి, నగర్ అధ్యక్షులు శ్రీకాంత్, శంకర్, విశ్వంత్, కోటేశ్వర్ రెడ్డి, శ్రవణ్ బోస్, శ్రీకాంత్, రోహిత్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మహా పడిపూజకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఆహ్వానం

**- మసనం శ్రీను లక్ష్మయ్య ఫౌండేషన్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం మార్కండేయ నగర్ లో డిసెంబర్ 2వ తేదీన నిర్వహించ తలపెట్టిన శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని మసనం శ్రీను లక్ష్మయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు మసనం శ్రీను ఆదివారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మసనం లక్ష్మయ్య ఫౌండేషన్ సభ్యులు మసనం సిద్ధు, కోడి అశోక్, దీప నరేష్, ఆవుల నిఖిల్, దండు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ గిరిజన కుటుంబాలకు రగ్గుల పంపిణీ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: హైదరాబాద్కు చెందిన బటర్ఫ్లై చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో సామాజిక కార్యకర్త రూప్లా నాయక్ ఆధ్వర్యంలో పాల్వంచ మండలం బంధంగొండ గ్రామపంచాయతీ పరిధిలోని కోయగట్టు, చిరుతా నుపాడు గ్రామాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజన 70 కుటుంబాల మహిళలకు ఆదివారం రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బటర్ఫ్లై చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నీలేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కోసం ట్రస్ట్ నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బటర్ఫ్లై చారిటబుల్ ట్రస్ట్ టీం సభ్యులు, గ్రామస్తులు, యువజనులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి సీఎండీ ఎన్ . బలరాం నాయక్ కు మొక్క అందజేసిన నైనిక రజువా



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్లోని ప్రొఫెసర్ జయశంకర్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఆల్ ఇండియా కబడ్డీ పోటీల ముగింపు వేడుకలకు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా, ఆఫాన్ జైదీలు కలిసి సీఎండీకి మొక్కను అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు చిన్న వయసులోనే చూపుతున్న చైతన్యాన్ని సీఎండీ ప్రశంసించి, నైనిక రజువా, ఆఫాన్ జైదీలను అభినందించారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి, ప్రపంచ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ''నేడు మొక్కలను నాటకపోతేం రేపు మొక్కలను వీపున మోయాల్సిన పరిస్థితి వస్తుంది'' అనే సందేశంతో నైనిక రజువా, ఆపాన్ జైదీలు క్రీడా ప్రాంగణంలో ఫ్లకార్డులు పట్టుకుని వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు త్యాగరాజు, రజాక్, తదితరులు పాల్గొన్నారు.



## నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని కోడిపుంజుల వాగు గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదివారం తనిఖీ చేశారు. సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నిక కోసం జారీ చేసిన నోటిఫికేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి తప్పిదాలు, పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని, అవసరమైన వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ సొంత నిర్ణయాలను అమలు చేయకూడదని అన్నారు. విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి తు.చ తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయ పరిమితిని పక్కాగా లెక్కించేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్త బ్యాంకు అకౌంట్ తెరిచి, ఆ అకౌంట్ ద్వారానే ఎన్నికల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల అవసరాల నిమిత్తం కొత్త బ్యాంకు అకౌంట్ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఆయా బ్యాంకులు వెంటనే అకౌంట్ ఓపెన్ చేసేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు



## కోల్ ఇండియా స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా డబ్ల్యూసీఎల్

*** సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ చేతులమీదుగా బహుమతుల ప్రదానం**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం (రుద్రంపూర్): సింగరేణి కాలరీస్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో 202526 ఆర్థిక సంవత్సరానికి గాను రుద్రంపూర్ ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించిన కోల్ ఇండియా స్థాయి పురుషుల కబడ్డీ పోటీల ముగింపు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరామ్ ముఖ్య అతిథిగా హాజరై విజేత జట్లకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో కోల్ ఇండియాకు చెందిన 8 అనుబంధ సంస్థల జట్లు పాల్గొన్నాయని తెలిపారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమేనని, క్రీడా స్ఫూర్తితో పాల్గొనడం శారీరకంగా, మానసికంగా దృఢత్వాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. విజేతగా నిలిచిన డబ్ల్యూడబ్ల్యుసీఎల్ జట్టును, సింగరేణి ఫస్ట్ రన్నర్గా, ఎస్ఈసీఎల్ సెకండ్ రన్నర్గా నిలిచిన జట్లను అభినందించారు. ఓడిన జట్లు నిరుత్సాహపడకుండా మరింత పట్టుదలతో వచ్చే ఏడాది ట్రోఫీ సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఒలింపిక్ పతాకాన్ని అవనతం చేసి పోటీలను అధికారికంగా ముగించారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు అధ్యక్షత వహించగా, డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, ఎం. తిరుమలరావు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఉన్నతాధికారులు, యూనియన్ నాయకులు, సిబ్బంది, క్రీడాకారులు హాజరయ్యారు.

## ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభానికి సర్వసన్నద్ధం

*** సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేస్తున్న డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం సమగ్రంగా పరిశీలించారు.డిసెంబర్ 2న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి యూనివర్సిటీని ప్రారంభించనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అత్యంత క్రమశిక్షణతో తమ బాధ్యతలు నిర్వర్తించాలని మంత్రి ఆదేశించారు. శిలాఫలకం ఏర్పాటు, సభాస్థలం, యూనివర్సిటీ ప్రాంగణాన్ని సందర్శించిన మంత్రి, జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ భూగోళ శాస్త్రాలు, సహజ వనరులు, ఖనిజ పరిశోధనలతోపాటు అభివృద్ధికి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ కీలకంగా మారనున్నదన్నారు. ఖనిజ సంపదలకు ప్రసిద్ధి చెందిన కొత్తగూడెం ప్రాంతం ఈ యూనివర్సిటీకి ఎంతో అనుకూలమని తెలిపారు. భారత పూర్వ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరును యూనివర్సిటికీ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు.

**అభివృద్ధి కార్యక్రమాలకు ఊపు**



పాల్వంచలో పాత విద్యుత్ కేంద్రాల తొలగింపు, పర్యావరణహిత విద్యుత్ కేంద్రాల నిర్మాణం, కొత్తగూడెం బైపాస్కు రూ.420 కోట్లతో జాతీయ రహదారి, సీతారామ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్కు రూ.3400 కోట్ల నిధుల మంజూరు వంటి కీలక అభివృద్ధి పనులకు సీఎం ఆమోదం తెలిపినట్లు మంత్రి తెలిపారు. దీని ద్వారా పలు నియోజకవర్గాలకు గోదావరి జలాలు అందనున్నాయని అన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ జిల్లాలో యూనివర్సిటీ స్థాపన గర్వకారణమని, సీఎం పర్యటనను విజయవంతం చేయడానికి ప్రజలు, అధికారులు కలిసి పనిచేయాలని కోరారు. సీఎం పర్యటనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లను పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యా చందన, ఆర్డీవో మధు తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్లో గ్రూప్1, ఐఐటీ, నీట్ విజేతలకు ఘన సన్మానం

**: రెడ్డి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందన సభ**

(వికారాబాద్ ప్రజా స్ఫూర్తి): నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని గ్రూప్ 1తో పాటు సివిల్స్ వంటి అత్యున్నత లక్ష్యాలను సాధించాలని రాష్ట్ర ఎత్తిపోతల పథకం సలహాదారులు, ప్రముఖ ఇంజనీర్ కొత్తపల్లి పెంటా రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కొండ బాలకృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్లో రెడ్డి సంఘం వికారాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇటీవల వెలువడిన గ్రూప్ 1, ఐఐటీ , నీట్ ఫలితాల్లో విజయం సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులను ఘనంగా సన్మానించారు.ముఖ్య అతిథిగా హాజరైన కె. పెంటారెడ్డి మాట్లాడుతూ.. తాము చదువుకునే రోజుల్లో ఎలాంటి సౌకర్యాలు లేకపోయినా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకున్నామని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు సాంకేతికత, వనరులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం మెండుగా ఉన్నాయని, వీటిని ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖులు అర్థ సుధాకర్ రెడ్డి చేతుల మీదుగా ఐఐటీ ఖరగపూర్లో సీటు సాధించిన బిళ్లపాటి శృతిక రెడ్డిని, అలాగే ఎంబీబీఎస్ సీట్లు సాధించిన పలువురు విద్యార్థులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు సంకేపల్లి మోహన్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ సభలో కె. ప్రభాకర్ రెడ్డి, కొండా లక్ష్మీకాంత్ రెడ్డి, రత్నా రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని వారు సూచించారు.ఈ కార్యక్రమ నిర్వహణలో కోర్ కమిటీ సభ్యులు యాదవ రెడ్డి, ఎన్. మోహన్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, పిచ్చిరెడ్డి, నరోత్తం రెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు కీలక పాత్ర పోషించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్.. ఆ ముగ్గురికి సీఎం రేవంత్ ప్రత్యేక ఆహ్వానం

హైదరాబాద్: ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను డిసెంబరు 8, 9వ తేదీల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. అంతర్జాతీయ, జాతీయ ప్రతినిధులను ప్రత్యేకంగా ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కలిసి ఆహ్వానించనున్నారు. కేంద్ర మంత్రులు, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, దిగ్గజ పారిశ్రామిక, ఆర్థికవేత్తలు, క్రీడాకారులు, మీడియా ప్రముఖులు, దౌత్యవేత్తలు, వివిధ రంగాల నిపుణులను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించనుంది. ఇందుకోసం ఆహ్వాన కమిటీని ప్రభుత్వం నియమించనుంది. ఈ ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేస్తారు. ఎవరిని ఆహ్వానించారు.. ఎవరు ఆహ్వానించారు.. వారి రాకను నిర్ధారించడం, వచ్చే వారికి తగిన వసతులు కల్పించడంతో పాటు వారికి లైజనింగ్ చేసేందుకు ఉన్నతాధికారుల నియామకం వంటి అంశాలను పొందుపర్చనున్నారు. ఆహ్వాన కమిటీని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ సమన్వయం చేయనున్నారు. ఆహ్వానాలకు సంబంధించి వివరాలను డ్యాష్‌బోర్డ్ ద్వారా సీఎం పర్యవేక్షించనున్నారు. వివిధ రంగాలకు సంబంధించి ఇప్పటికే 4,500 మంది ప్రతినిధులకు ఆహ్వానాలు పంపామని.. అందులో వెయ్యి మంది ఇప్పటికే తమ రాకను నిర్ధారించారని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు.



## పీసీసీ డాక్టర్స్ సెల్ వైస్‌చైర్మన్‌గా డాక్టర్ వీరన్న నియామకం

- * ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలపర్చడంలో కృషి చేస్తా...
- * డాక్టర్ అద్దంకి వీరన్న



అందోలు, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీ పీసీసీ) డాక్టర్స్ సెల్, మెడికల్ & హెల్త్ విభాగం వైస్‌చైర్మన్‌గా జోగిపేట కు చెందిన డాక్టర్ అద్దంకి వీరన్నను నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎం.రాజీవ్ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే అమలులోకి వచ్చే విధంగా ఈ నియామకాన్ని ప్రకటించారు.పార్టీ బలోపేతం కోసం నిరంతరం శ్రమించాలని, టీ పీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ నాయకత్వాన్ని మరింతగా నిలబెట్టాలని ఈ సందర్భంగా డా. రాజీవ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలపర్చడంలో డా. వీరన్న మరింతగా సేవలు అందిస్తారని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర పీసీసీ వైద్య విభాగం వైస్ చైర్మన్ గా నియమించ డానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ , రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనరసింహా , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ డాక్టర్ సెల్ మెడికల్ హెల్త్ ఛైర్మన్ డాక్టర్ రాజీవ్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## గత అనుభవాల పాఠాలతో భవిష్యత్తు ప్రణాళికలు

హైదరాబాద్: గత అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలతో భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో సీఎం, మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అద్భుత పాలసీని జాతికి అంకితం చేస్తున్నట్టు చెప్పారు. బలమైన ఆర్థిక రాష్ట్రంగా నిలదొక్కుకునేందుకు విజన్ డాక్యుమెంట్ తయారు చేసినట్టు పేర్కొన్నారు. "విజన్ డాక్యుమెంట్ 2047లో విజన్, స్ట్రాటజీ.. రెండు ప్రధాన అంశాలు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి పారదర్శక పాలసీలు ఉండాలి. పాలసీలకు పెరాలసిస్ వస్తే పెట్టుబడులకు రక్షణ లేకుండా పోతుంది. ఐఎస్‌బీ, నీతి ఆయోగ్ సంస్థల సహకారంతోపాటు విజన్ డాక్యుమెంట్ తయారీలో లక్షలాది మందిని భాగస్వాములను చేస్తున్నాం. ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. నెట్ జీరో సిటీ, కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్‌ను మార్చాలి. కోర్ అర్బన్ రీజియన్‌ను సర్వీస్ సెక్టార్‌గా మారుస్తున్నాం. తెలంగాణ అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తాం. కొత్తగా క్యూర్, ప్యూర్, రేర్ పాలసీలు తీసుకువస్తున్నాం. ఆదాయం పెంచి.. పేదలకు పంచే విధానంతో బలమైన ఆర్థిక వ్యవస్థను తయారు చేస్తాం. 2034 నాటికి ఒక ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం. భారత ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ నుంచి 5శాతం అందిస్తున్నాం. దీన్ని 10 శాతానికి పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రీన్ ఫీల్డ్ హైవేలు, బుల్లెట్ రైళ్ల కోసం కేంద్రాన్ని ఒప్పిస్తున్నాం. తెలంగాణకు మరో 4 విమానాశ్రయాలు తీసుకొస్తున్నాం. వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, రామగుండంలో ఎయిర్‌పోర్టులు ఏర్పాటు కానున్నాయి. హైదరాబాద్ మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం కేంద్రంతో అంగీకారం కుదిరింది. హైవేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ ద్వారా పెట్టుబడులు ఆకర్షిస్తాం" అని సీఎం తెలిపారు.






## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు

**: పాశం సంజయ్ బాబు**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా నూతన అధ్యక్షునిగా చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారం గ్రామానికి చెందిన పాశం సంజయ్ బాబు రెండోసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని నూతనంగా ఎన్నికైన చైర్మన్ పాశం సంజయ్ బాబు ఆదివారం హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిశారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఎలమోని శ్రీకాంత్, పాశం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నెక్లెస్ రోడ్‌లో 'సంవిధాన్ శక్తి' పేరిట రన్

హైదరాబాద్: నగరంలోని నెక్లెస్ రోడ్‌లో 'సంవిధాన్ శక్తి' పేరిట రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక పాల్గొన్నారు. ఏక్ నయా దిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3K, 5K రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ నగేశ్ భీమపాక మాట్లాడారు. "మీ పేరు ఒకసారి ఎఫ్ఐఆర్‌లో నమోదైతే మీ బంగారు భవిష్యత్ నాశనం అవుతుంది. భవిష్యత్ బంగారుమయం చేసుకోవాలంటే చెడు వ్యసనాలకు దూరం ఉండాలి. డ్రగ్స్ పెడ్లర్‌గా యువతను మార్చడమే లక్ష్యంగా కొన్ని ముఠాలు ఉంటాయి. యువత వాటి బారిన పడొద్దు. మెడిటేషన్ చేస్తే అన్ని డ్రగ్స్‌ను మించిన కిక్ ఉంటుంది. చిన్నపిల్లలకు కూడా డ్రగ్స్ అలవాటు చేస్తున్న వారిని చూస్తే ఆందోళన కలుగుతోంది. పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి" అని అన్నారు.












## దంతేవాడ జిల్లాలో లొంగిపోయిన 37 మంది మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలో ఆదివారం 37 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చారు. జిల్లా ఎస్పీ గౌరవ్ రాయ్ ఎదుట వీరంతా సరెండర్ అయ్యారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో 12 మంది మహిళలు ఉన్నారు. వీరిపై రూ.67 లక్షల మేర రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ పాలసీ ప్రకారం తక్షణ సాయం కింద రూ.50 వేలు చొప్పున నగదు సాయం అందించనున్నారు.

## డిజిటల్ అరెస్టు కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు



హైదరాబాద్: డిజిటల్ అరెస్టు కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులు పండు వినీత్‌రాజ్, తిరుపతయ్య, గౌని విశ్వనాథామ్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలను పండు వినీత్‌రాజ్ సమకూర్చగా.. జాయింట్ హోల్డర్లుగా తిరుపతయ్య, విశ్వనాథం ఉన్నారు. నిందితులపై దేశవ్యాప్తంగా 5 కేసులుండగా.. వాటిలో తెలంగాణలోనే 2 కేసులు ఉన్నాయి. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు సందీప్ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. బాధితుడి నుంచి రూ.1.92 కోట్లు వీరు కాజేశారు. నవంబర్ 7–14 వరకు వివిధ బ్యాంకు ఖాతాల్లో బాధితుడు డబ్బు జమచేశాడు. సీబీఐ అధికారుల పేరిట బాధితుడికి ఫోన్ చేసి నిందితులు మోసగించారు. ఆధార్ దుర్వినియోగంతో కేసు నమోదైందంటూ బెదిరించారు.

## హైదరాబాద్‌లో హోటల్‌కు బాంబు బెదిరింపు కాల్

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. మాదాపూర్ పరిధిలోని లెమన్ ట్రీ రెడ్ ఫాక్స్ హోటల్‌కు బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. హోటల్‌లో ఒక చోట బాంబు పెట్టామని ఫోన్ చేసి అలర్ట్ చేశారు. దీంతో భయాందోళన చెందిన హోటల్ సిబ్బంది వెంటనే బయటకు పరుగులు తీశారు. అనంతరం మాదాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. ప్రస్తుతం పోలీసులు, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. దాదాపు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సోదాలు చేసి ఏమీ లేదని తేల్చారు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




## బీజేపీ బీసీల పక్షపాత పార్టీ : ఎంపీ కృష్ణయ్య

బీజేపీ బీసీల పక్షపాత పార్టీ అని , ఇప్పటివరకు ముగ్గురు బీసీలను ప్రధాని చేసిందని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. సోమవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బాణాల అజయ్ కుమార్ అధ్యక్షతన బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీ ఆర్ కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. రానున్న శీతాకాల సమావేశాల్లో ప్రధాని మోడీతో మాట్లాడి , బీసీల 42 శాతం రిజర్వేషన్లతో పాటు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన చెప్పారు. ప్రధాని మోడీ నేతృత్వంలో చేపట్టబోతున్న దేశవ్యాప్త కుల గణనతో , ఎవరికి దక్కాల్సిన వాటా వారికి దక్కుతుందన్నారు. ప్రపంచదేశాలు మోడీని తమ దేశానికి ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నారని కృష్ణయ్య అన్నారు. ప్రధాని మోడీతో జనవరి నెలలో సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ లో ఐదు లక్షల మంది బీసీలతో భారీ బహిరంగ సభ నిర్వహించి, బీసీల హక్కులను సాధించుకుంటామన్నారు. బీసీల సమస్యలపై డిసెంబర్ 10న ఢిల్లీలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్ కృష్ణయ్య వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బీసీ మహిళా సంఘం అనురాధ గౌడ్, తెలంగాణ బీసీ ఐక్య వేదిక అధ్యక్షులు అనంతయ్య, విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ మోడీ రాందేవ్, రాజేందర్, లింగయ్య యాదవ్, భీమ రాజు, పద్మ, శివ యాదవ్, రాజు గౌడ్, నిఖిల్, సుప్రజా, గణేష్ భవాని తదితరులు పాల్గొన్నారు.



# సోగ కళ్ల సొగసు కోసం..!



**కళ్లకి కాటుక... వింజామరలాంటి కనురెప్పలు... వంపులు తిరిగిన కనుబొమలు... ఇవేనా ఇంకెన్నో సొగసులు అద్దితేగానీ... కళ్ల మేకప్ పూర్తవదు. అందం సంపూర్ణమవదు. నిజానికి ముఖం అందం పెంచేది కళ్లే అని భావిస్తారు అమ్మాయిలు. కాబట్టే, ఎంత మేకప్‌కి దూరంగా ఉండేవారైనా కళ్ల సింగారాన్ని మాత్రం కాదనరు. దాన్ని సులువు చేసేవి ఇవి...**

**ఇదొక్కటి చాలు...**

కాటుక కన్ను దాటొద్దు, మస్కారా కంటి చుట్టుపక్కల అంటొద్దు... ఐలైనర్ తీరుగా రావాలి. అప్పుడేగా అందమైన కళ్లూ సాధ్యం. అలా కావాలంటే ఈ మల్టీఫంక్షనల్ ఐ మేకప్ టూల్ కావాల్సిందే! ఇది లిప్‌లైనర్, లిప్‌స్టిక్ నచ్చినట్లుగా తీర్చిదిద్దుకోవడానికీ సాయపడుతుంది. ఇంకా కంటైనర్‌లో చివరికి చేరిన క్రీమ్‌ని తీసుకోవడానికీ దీనికింది భాగం స్పూన్‌లా ఉపయోగపడుతుంది.


**అతికించేయండి**

కనుమూలల్లో వంపులు తిరుగుతూ సోగకళ్లను మరింత పెద్దవిగా చేస్తూ తీర్చిదిద్దే ఐలైనర్ అంటే ప్రతి అమ్మాయికీ ప్రేమే. సమస్యల్లా ఆ వంపు తిప్పడమే! ఈ క్రమంలో ఎన్నెన్నిసార్లు తుడిచి మళ్లీ వేయాలో! ఈ ఇబ్బంది అంతా వద్దు అనుకుంటే ఈ ఐలైనర్ స్టిక్కర్స్‌ని తెచ్చేసుకోండి. కావాల్సినప్పుడల్లా అతికించేసుకుని తిరిగి తీసేయడమే. వాటర్ ప్రూఫ్. తొలగించడమూ సులువే. ముఖ్యంగా తిరిగి వాడుకోవచ్చు. నలుపే కాదు... భిన్న రంగుల్లోనూ దొరుకుతున్నాయి.

**నచ్చినట్లుగా సిద్ధమైపోవచ్చు**

ఫిష్‌టెయిల్, థిక్ వింగ్, ఆల్ రౌండ్ వింగ్, క్యాట్ వింగ్... ఐలైనర్ లుక్‌లూ బోలెడు. సంప్రదాయ వస్త్రాలు, పార్టీ, వేడుక ఒక్కోదాన్ని బట్టి దీన్నీ మారుస్తుంటారు అమ్మాయిలు. అప్పుడే ప్రత్యేకత. కానీ దాన్ని తీర్చిదిద్దడంలోనే సగం సమయం అయిపోతుంది. అది తగ్గాలంటే ఈ ఐలైనర్ ఐషాడో స్టెన్సిల్స్ తెచ్చుకోండి. నచ్చిన ఐలైనర్ వేశాక... దానికి తగ్గట్టుగా ఐషాడో ఏమేరకు వేయాలో తెలిపే స్టెన్సిల్స్ కూడా ఉంటాయి. వాటిని అనుసరిస్తూ వేసుకోండి. నిమిషాల్లో అందమైన కళ్లు సొంతం. ఇంకేం... వీటిలో మీకు అనువైనవేవో ఎంచుకుని తెచ్చేసుకోండి. వేడుకల్లో మెరిసిపోండి మరి!









## ముద్ద నందివర్ధనం.. మురిపిస్తోంది!

ఈ నందివర్ధనం అపోసినేసియా కుటుంబానికి చెందిన మొక్క. ఇందులోనే ముద్ద రేకల రకమూ ఒకటి. ప్రాంతాన్ని బట్టి చాందినీ, తగర్, పంచ కర్పూర పువ్వు, చంద్రమణి వంటి పేర్లతోనూ పిలుస్తారు. ఇది పొదలా గుబురుగా పెరుగుతుంది. మనం కోరుకున్న ఎత్తులో కత్తిరింపుల ద్వారా నియంత్రించుకోవచ్చు. నిగనిగలాడే పచ్చటి ఆకులు, మెత్తగా మందమైన పొరల్లో పూసే పూలు, హాయినిచ్చే సువాసనతో ప్రత్యేక గుర్తింపు అందుకున్న ఈ మొక్కకు ఔషధ గుణాలూ ఎక్కువేనట. అందుకే, ప్రాచీన కాలం నుంచీ ఆయుర్వేదంలో వాడుతున్నారు. ఇది మన దేశంతోపాటు శ్రీలంక, దక్షిణ చైనాలోనూ ఎక్కువగా కనిపిస్తుంది. సంరక్షణ ఇలా... నందివర్ధనం మొక్క ఆరోగ్యంగా ఎదగాలంటే... దానికి కనీసం నాలుగైదు గంటలైనా సూర్యకాంతి అందేలా చూసుకోవాలి. కుండీల్లో పెంచుకోవాలనుకుంటే... నీరు నిలవని సారవంతమైన మట్టిని ఎంచుకోవాలి. తొట్టె కూడా కాస్త పెద్ద పరిమాణంలో ఉన్నదే వాడండి. నీళ్లు ఎక్కువైతే మొక్క దెబ్బతినే అవకాశం ఉంది. తేమ లేదనుకున్నాకే తడి అందించండి. పోషకాలు సరిగా అందితే పూలూ బాగా పూస్తుందీ మొక్క. ఎక్కువ రోజులూ తాజాగా ఉంటుంది. అందుకే, రెండు మూడు వారాలకోసారి పొటాషియం మోతాదు ఎక్కువ ఉండే ఎన్‌పీకే సమగ్ర ఎరువుని క్రమం తప్పకుండా అందించాలి. కొమ్మ కత్తిరింపులు, విత్తనాల ద్వారా కొత్త మొక్కల్ని మొలకెత్తించవచ్చు. పూత పూయడం ఆగిపోయాక 40 శాతం వరకూ కొమ్మల్ని కత్తిరించుకోవాలి. అఫిడ్స్, మిలీబగ్స్, ఎర్ర సాలీడు, ఆకు ముడతతో పాటు వేరు కుళ్లు తెగులూ వచ్చే అవకాశం ఉంది. వీటిని నివారించడానికి లీటరు నీటిలో సబ్బు ద్రావణం, పదిగ్రాములు వెల్లుల్లి పేస్టు, కాస్త వంటనూనె కలిపి సాయంత్రం పూట స్ప్రే చేస్తే సరి.





## కుంకుడు కాయలు.. ఇలా కూడా..!



**ఒకప్పుడు తలస్నానం చేయడానికి కుంకుడు కాయలనే ఉపయోగించేవారు. అయితే మార్కెట్లోకి షాంపూలు అందుబాటులోకి వచ్చాక వాటి వాడకం బాగా తగ్గిపోయింది. అయితే కేవలం జుట్టును శుభ్రపరచుకోవడానికే కాకుండా ఇంట్లో ఇతరత్రా పనులకు కూడా కుంకుడు కాయల్ని ఉపయోగించుకోవచ్చంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం రండి..**



**లిక్విడ్ సోప్‌గా..**

కప్పు నీటిలో రెండు కుంకుడు కాయలు వేసి అరగంట పాటు మరగబెట్టాలి. ఆ తర్వాత పూర్తిగా చల్లారనిచ్చి వడకట్టుకోవాలి. దీనికి మీకు నచ్చిన ఫ్లేవర్ అరోమా ఆయిల్‌ని కొన్ని చుక్కలు వేసి కలుపుకోవాలి. అనంతరం శుభ్రంగా కడిగి పొడిగా ఆరబెట్టుకున్న బాటిల్‌లో ఈ మిశ్రమాన్ని పోసి ఫ్రిజ్‌లో నిల్వ చేసుకోవాలి. దీన్ని స్నానం చేసేటప్పుడు సబ్బుకి బదులుగా ఉపయోగించవచ్చంటున్నారు నిపుణులు.

**గ్లాస్ క్లీనర్‌గా..**

కిటికీల అద్దాలను తుడవడానికి సాధారణంగా మార్కెట్లో దొరికే క్లీనింగ్ లిక్విడ్‌లను ఉపయోగిస్తాం. అయితే వీటికి బదులుగా కుంకుడు కాయలను ఉపయోగించి కూడా ఇంట్లోనే గ్లాస్‌క్లీనర్‌ను తయారు చేసుకోవచ్చు. దీనికోసం కుంకుడు కాయలతో తయారుచేసుకున్న లిక్విడ్ సోప్ ఒక టేబుల్ స్పూన్, రెండు టేబుల్ స్పూన్ల వైట్ వెనిగర్, అరకప్పు నీటిని తీసుకొని బాగా కలుపుకోవాలి. దీన్ని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి బాగా షేక్ చేయాలి. అనంతరం దీన్ని కిటికీ అద్దంపై స్ప్రే చేసి మెత్తటి వస్త్రంతో తుడిచేయాలి. ఇలా చేస్తే కిటికీ అద్దాలపై పేరుకున్న దుమ్ము తొలగిపోయి అవి కొత్త వాటిలా మెరుస్తాయట.

**పట్టు వస్త్రాలకు..**

పట్టు, జరీ దుస్తుల్ని ఉతకడానికి కుంకుడు కాయలు చక్కటి ప్రత్యామ్నాయం. దీనికోసం కొన్ని కుంకుడు కాయలను చల్లటి నీటిలో నానబెట్టి వాటి రసాన్ని తీయాలి. ఈ మిశ్రమంతో పట్టు, జరీ వస్త్రాలను ఉతికితే అవి ఎక్కువ కాలం మన్నడంతో పాటు రంగు వెలిసిపోకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు నిపుణులు. అంటే పట్టు, ఇతర సున్నితమైన వస్త్రాల్ని మనం ఎలాగైతే షాంపూ వాష్ చేస్తామో.. ఆ షాంపూ బదులుగా ఈ సహజసిద్ధమైన షాంపూను ఉపయోగించచ్చన్నమాట!

**కిచెన్ క్లీనర్‌గా..**


అరకప్పు కుంకుడుకాయ రసానికి రెండు చెంచాల వైట్ వెనిగర్, కొద్దిగా నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని స్ప్రే బాటిల్‌లో పోసి బాగా షేక్ చేసుకోవాలి. దీంతో కిచెన్ ప్లాట్‌ఫాం, వాష్‌బేసిన్ లాంటివి శుభ్రం చేసుకోవచ్చు. అలాగే దీన్ని బాత్‌రూం క్లీనర్‌గా కూడా ఉపయోగించవచ్చు.





# ఏ320 విమానాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకొన్న భారతీయ ఎయిర్‌లైన్స్ సంస్థలు


భారత్ ఎయిర్‌లైన్స్ వాడే ఎయిర్‌బస్ ఏ320 విమానాల్లో సాఫ్ట్‌వేర్ సమస్యను పరిష్కరించినట్లు డీజీసీఏ ఆదివారం వెల్లడించింది. మొత్తం 323 విమానాల్లో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసినట్లు పేర్కొంది. భారత్ ఎయిర్ బస్‌కు చెందిన ఏ320 రకం 338 విమానాలను వినియోగిస్తోంది. ఇవి ప్రధానంగా ఇండిగో, ఎయిర్ ఇండియా, ఇండియా ఎక్స్‌ప్రెస్ వద్ద ఉన్నాయి. వీటిల్లో 323 మాత్రమే ప్రస్తుతం విధుల్లో ఉండగా..



ఆరు మెయింటెనెన్స్‌లో ఉన్నాయి. మరో తొమ్మిది విమానాలకు ఎటువంటి అప్‌గ్రేడ్ అవసరంలేదని డీజీసీఏ అధికారులు తెలిపారు. సూర్యుడి వేడి కారణంగా ఎయిర్‌బస్ ఏ320 విమానాల్లో సాఫ్ట్‌వేర్ వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. తత్ఫలితంగా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఇటీవల ఎయిర్‌బస్‌కు చెందిన జెట్ బ్లూ ఏ320 అనే విమానానికి ఇలాంటి పరిస్థితే ఎదురైంది. దీంతో ఈ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసుకోవాలని ఎయిర్‌బస్ కీలక హెచ్చరికలు జారీ చేసింది. సాఫ్ట్‌వేర్ దెబ్బతినడానికి తీవ్రమైన సోలార్ రేడియేషన్ కారణమని అధికారులు తాజాగా తేల్చారు. ఏ320 మోడల్ విమానాల్లో నియంత్రణకు సంబంధించిన కీలక డేటా దెబ్బతిందని, అందువల్ల సాఫ్ట్‌వేర్‌లో మార్పులు సూచిస్తున్నామని ఎయిర్‌బస్ పేర్కొంది. భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా 6 వేల ఎయిర్‌బస్ విమానాలకు సాఫ్ట్‌వర్ అప్‌గ్రేడేషన్ అవసరమని పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఏ320 విమానాల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. ఈ క్రమంలో భారత్‌లోని అన్ని విమాన సంస్థలు ఆ మేరకు చర్యలు చేపట్టాలని పౌర విమానాల నియంత్రణ సంస్థ (డీజీసీఏ) ఆదేశాలు జారీచేసింది. ఎయిర్‌బస్ ప్రకటన నేపథ్యంలో తమ విమాన సర్వీసులకు సంబంధించి ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎయిర్‌ఇండియా, ఇండిగో, ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్ తెలిపాయి.

## యూకేలో భారత యువకుడి దారుణ హత్య

యూకేలో భారత విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. యూకేలోని వోర్‌స్టర్‌లో నవంబర్ 25న హరియాణాకు చెందిన విజయ్ కుమార్ షియోరాన్ (30) అనే యువకుడిపై గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడి చేసినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా..చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ కేసులో ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు. హరియాణాకు చెందిన విజయ్ కుమార్ షియోరాన్ ఈ ఏడాది ప్రారంభంలో ఉన్నత చదువుల కోసం యూకేకు వెళ్లినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. అంతకు ముందు అతడు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్‌లో ఉద్యోగం చేసేవాడని.. ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి జనవరిలో బ్రిటన్‌కు వెళ్లినట్లు పేర్కొన్నారు. విజయ్



కుమార్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకురావడానికి సహాయం చేయాలని కోరుతూ మృతుడి కుటుంబసభ్యులు విదేశాంగ మంత్రిత్వ శాఖ, హరియాణా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీలను సంప్రదించారు.

## నేషనల్ హెరాల్డ్ కేసులో

# రాహుల్, సోనియాపై కొత్త ఎఫ్ఐఆర్

ఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో ఢిల్లీ ఈవోడబ్ల్యూ కాంగ్రెస్ అగ్రనేతలు సహా మరికొందరిపై కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇచ్చిన సమాచారంతో ఎఫ్ఐఆర్‌లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు మరో ఆరుగురిపై నేరపూరిత కుట్ర అభియోగాలు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దూబే, శ్యామ్ పిట్రోడాలతోపాటు యంగ్ ఇండియా సంస్థ కూడా కుట్ర, మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఈడీ ఆరోపిస్తోంది. వీరందరూ కుట్రపూరితంగా కేవలం రూ.50 లక్షలు మాత్రమే చెల్లించి.. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.2వేల కోట్ల విలువైన ఆస్తులపై అధికారాన్ని పొందారని ఆరోపించింది. కాగా మోతీలాల్ వోరా 2020లో మృతిచెందగా.. ఆస్కార్ ఫెర్నాండెజ్ 2021లో మృతిచెందారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రచురిస్తున్న అసోసియేటెడ్ జర్నలిస్ట్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు కాంగ్రెస్ పార్టీ రూ.90 కోట్ల రుణం అందించి దాని ఆస్తుల్ని ఆధీనంలోకి తీసుకోగా..



రాహుల్, సోనియాకు మెజార్టీ వాటా ఉన్న యంగ్ ఇండియా రూ.50 లక్షలు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెల్లించి ఏజేఎల్‌ను సొంతం చేసుకొన్నట్లు అభియోగపత్రంలో ఈడీ పేర్కొంది. ఎన్నికల్లో పార్టీ టికెట్లు కేటాయిస్తామని, పదవులకు ఎంపికచేస్తామని, వ్యాపారాలకు రక్షణ కల్పిస్తామంటూ వివిధ వ్యక్తుల నుంచి పార్టీ సీనియర్ నేతల ద్వారా అక్రమార్జనకు పాల్పడ్డారని తెలిపింది.



### చిన్నారి పుట్టిన రోజు వేడుకల్లో కాల్పులు..

## కాలిఫోర్నియాలో నలుగురి మృతి

అమెరికాలో మళ్లీ కాల్పులు కలకలం సృష్టించాయి. కాలిఫోర్నియాలోని స్టాక్‌టన్‌లో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కాల్పులకు పాల్పడినట్లు శాన్ జోక్విన్ కౌంటీ షెరీఫ్ కార్యాలయం వెల్లడించింది. ఈ ఘటనలో పదుల సంఖ్యలో ప్రజలు గాయపడినట్లు పేర్కొంది. క్షతగాత్రుల్లో చిన్నారులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. స్టాక్‌టన్‌లోని హోటల్లో ఓ చిన్నారి పుట్టిన రోజు వేడుకలు జరుగుతుండగా.. పార్టీ హాల్‌లోకి చొరబడిన దుండగులు అక్కడి వారిపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే దుండగులు కాల్పులకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. మృతుల వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

## 'సర్' గడువు ఏడు రోజులు పొడిగించిన ఈసీ


ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) గడువును 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మరో ఏడు రోజులు పొడిగిస్తూ ఈసీ నిర్ణయం తీసుకొంది. ఓటర్లు తమ పేర్లను ఎలక్టోరల్ రోల్స్‌లో తనిఖీ చేసుకొనేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకొంది. ప్రస్తుతం ఎస్ఐఆర్ రెండో దశలో ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఉన్నాయి. కొత్తగా ప్రకటించిన మార్పుల ప్రకారం ఎన్యూమరేషన్



ప్రక్రియ గడవు డిసెంబర్ 4 నుంచి డిసెంబర్ 11వ తేదీకి మారింది. ఇక రేషనలైజేషన్, రీ ఆరేంజ్‌మెంట్ ఆఫ్ పోలింగ్‌స్టేషన్స్ గడువు డిసెంబర్ 11గా ఉంది. ఇక కంట్రోల్ టేబుల్ అప్‌డేషన్, డ్రాఫ్ట్ రోల్‌ను సిద్ధం చేసే ప్రక్రియ డిసెంబర్ 1215 వరకు జరగనుంది. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ పబ్లికేషన్ డిసెంబర్ 16వ తేదీన జరగనుంది. ఇక క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రకటనకు డిసెంబర్ 16 2026 జనవరి 15వ తేదీ వరకు సమయం ఇచ్చింది. ఇక నోటీస్ ఫేజ్‌ను డిసెంబర్ 16 నుంచి 2026 ఫిబ్రవరి 7గా నిర్ణయించింది.

## అవినీతి ఆరోపణలు.. క్షమాభిక్ష కోరిన నెతన్యాహు

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు.. తనకు క్షమాభిక్ష ప్రసాదించాలని కోరుతూ అధ్యక్షుడు ఐజక్ హెర్జాగ్‌కు అధికారికంగా విజ్ఞప్తి చేశారు. ప్రధాని కార్యాలయం ఈ విషయాన్ని వెల్లడించింది. క్షమాభిక్ష కోసం ఆయన అధ్యక్ష కార్యాలయం న్యాయ విభాగానికి తన అభ్యర్థనను సమర్పించినట్లు తెలిపింది. మరోవైపు.. అధ్యక్ష కార్యాలయం దీనిని అసాధారణ అభ్యర్థనగా పేర్కొంది. ఇది అనేక చిక్కులతో ముడిపడి ఉందని తెలిపింది. నెతన్యాహు మూడు వేర్వేరు కేసుల్లో మోసం, నమ్మకద్రోహం, లంచాలు స్వీకరించడం వంటి అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఇజ్రాయెల్ చరిత్రలో విచారణకు హాజరైన ఏకైక ప్రధాన మంత్రిగా నిలిచారు. సంపన్న రాజకీయ మద్దతుదారులకు ఆయన అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే.. ఇంకా ఏ కేసులోనూ దోషిగా తేలలేదు. ఆయన కూడా మొదటినుంచి ఆరోపణలను ఖండిస్తూ వస్తున్నారు. నెతన్యాహును క్షమించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్‌ను కోరిన వారాల వ్యవధిలో ఈ పరిణామం చోటుచేసుకుంది. "నాపై విచారణ విషయంలో దేశం ముక్కలుగా విడిపోయింది. క్షమాభిక్ష ప్రసాదిస్తే.. దేశ ఐక్యత పునరుద్ధరణకు తోడ్పడుతాను. అదేవిధంగా వారానికి మూడుసార్లు కోర్టుకు హాజరు కావాలనే నిబంధన అనేది.. దేశ వ్యవహారాల నిర్వహణలో ఆటంకం కలిగిస్తుంది'' అని నెతన్యాహు పేర్కొన్నారు.



ఆయన అభ్యర్థనను తొలుత న్యాయశాఖకు అభిప్రాయం కోసం పంపుతారు. అక్కడి నుంచి అధ్యక్ష కార్యాలయంలోని న్యాయ సలహాదారుకు బదిలీ అవుతుంది. అనంతరం అధ్యక్షుడి వద్దకు చేరుతుంది.

# భానుడి తాకిడికి ఎ320 విమానాల విలవిల!

**చిన్నపాటి పక్షుల ఢీ ఘటనల పట్లే కాకుండా చిన్నపాటి సాఫ్ట్‌వేర్ వైరుధ్యాల విషయంలోనూ విమాన సంస్థలు అప్రమత్తంగా ఉండాలని జెట్‌బ్లూ సంస్థకు చెందిన ఎయిర్‌బస్ ఎ320 ఎయిర్‌క్రాఫ్ట్ ఉదంతం స్పష్టంచేస్తోంది. అక్టోబరు 30న ఈ లోహవిహంగం పైలట్ ప్రమేయం లేకుండానే అనూహ్యంగా ఆకాశం నుంచి కిందకి జారిపోవడం మొదలైంది. ఎయిర్‌క్రాఫ్ట్‌లోని సాఫ్ట్‌వేర్‌పై తీవ్రస్థాయి సౌరరేడియోధార్మికత ప్రభావం చూపడమే దీనికి కారణమని తేలడం నిపుణులను విస్మయానికి గురిచేసింది. విమాన డిజైన్ సమయంలో మరింత పకడ్బందీగా వ్యవహరించాల్సిన ఆవశ్యకతను ఇది సూచిస్తోంది.**

### ఎందుకీ సమస్య?


ఎ320 విమానాన్ని తొలిసారిగా 1984లో ప్రవేశపెట్టారు. ఫ్లైబైవైర్ అనే కంప్యూటరైజ్డ్ ఫ్లైట్ కంట్రోల్ వ్యవస్థ కలిగిన తొలి వాణిజ్య ఎయిర్‌క్రాఫ్ట్‌గా ఇది గుర్తింపు పొందింది. నింగిలో ఈ విమాన గమనాన్ని మార్చాలనుకున్నప్పుడు పైలట్.. కాక్‌పిట్‌లోని నియంత్రణ వ్యవస్థలను నిర్దేశిత రీతిలో కదిలిస్తారు. దీనికి అనుగుణంగా కంట్రోల్ వ్యవస్థలు ఎలక్ట్రానిక్ సంకేతాలను పంపుతాయి. ఈ సంకేతాలను ఎలివేటర్ అండ్ ఎయిలిరాన్ కంప్యూటర్ (ఈల్యాక్) ప్రాసెస్ చేస్తుంది. పైలట్ నిర్దేశానికి అనుగుణంగా ఎలివేటర్లు, ఎయిలిరాన్లను సర్దుబాటు చేస్తుంది. ఎలివేటర్‌లో కదలికల ద్వారా విమానాన్ని పైకి లేదా కిందకి వెళ్లేలా చేయవచ్చు. ఎయిలిరాన్లలో మార్పుల ద్వారా ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఎడమ లేదా కుడి వైపునకు మళ్లించొచ్చు. మొత్తంమీద ఈల్యాక్ వ్యవస్థ అనేది ఎలివేటర్, ఎయిలిరాన్లను నియంత్రించే మెదడు లాంటిది. ఇది గందరగోళానికి లోనైతే పైలట్ ప్రమేయం లేకుండానే ఈ రెండు వ్యవస్థల్లో మార్పులు జరిగి, విమాన గమనంలో ఆకస్మిక మార్పులు రావొచ్చు. ఫలితంగా ఎయిర్‌క్రాఫ్ట్ ఆకృతి పటిష్ఠతపై కూడా ప్రభావం పడొచ్చు. బోయింగ్ సంస్థకు చెందిన 737 మ్యాక్స్ విమానాల్లోనూ ఫ్లైట్ కంట్రోల్ సాఫ్ట్‌వేర్‌లో లోపాలు తలెత్తి, ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో ఆ శ్రేణి విమానాలను సుదీర్ఘ సమయం పాటు నిలిపివేశారు.

### సాఫ్ట్‌వేర్‌లో లోపంతో..

ఎయిర్‌బస్‌కు చెందిన ఎ320 తరగతి విమానాల్లో ఎల్104 అనే సాఫ్ట్‌వేర్ వెర్షన్‌ను ప్రవేశపెట్టారు. ఈ సాఫ్ట్‌వేర్ తీవ్రస్థాయి సౌర జ్వాలల ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉందని నిపుణులు తాజాగా పేర్కొన్నారు. దీనివల్ల.. అసాధారణ సందర్భాల్లో పైలట్ ప్రమేయం లేకుండానే ఎలివేటర్, ఎయిలిరాన్లలో ఆకస్మిక మార్పులు జరగొచ్చని తేల్చారు. జెట్‌బ్లూ విమానంలో ఎలివేటర్ ఇదేరీతిలో ఆకస్మికంగా మారడంతో విమానం వేగంగా కిందకి దిగిందని పేర్కొన్నారు. ఈ పరిణామం కొద్దిసేపే సాగింది. అయితే ఈ క్రమంలో విమాన డిజైన్ పరిమితులను అది దాటిపోయింది. ఈలోగా ఎయిర్‌క్రాఫ్ట్‌లోని ఆటోపైలట్.. దాని ప్రయాణ మార్గాన్ని సరిచేసింది.

### ఏమిటీ సౌరజ్వాలలు?

సూర్యుడి నుంచి వచ్చే ఆవేశిత రేణువులు, విద్యుదయస్కాంత తరంగాలను సౌర రేడియోధార్మికతగా పేర్కొంటారు. ఇందులో దృశ్యకాంతి, అతినీలలోహిత కిరణాలు,




ప్రొటాన్లు, ఎలక్ట్రాన్లు వంటి ఆవేశిత రేణువులు ఉంటాయి. కొన్నిసార్లు సూర్యుడి నుంచి విస్ఫోటంలా తీవ్రస్థాయి జ్వాలలు, సౌర తుపాన్లు వెలువడతాయి. ఆ సమయంలో సౌర రేణువులు.. కాంతి వేగంతో భూమిని తాకుతాయి. అయితే భూమికి సంబంధించిన అయస్కాంత క్షేత్రం, దట్టమైన వాతావరణం వల్ల పుడమి మీదున్న జీవానికి, సాంకేతిక పరిజ్ఞానానికి సహజసిద్ధ రక్షణ లభిస్తోంది. విమానాలు ప్రయాణించే ఎత్తయిన ప్రదేశాల్లో ఈ రక్షణ ఒకింత తగ్గుతుంది. సౌర తుపాను బలంగా ఉన్నప్పుడు నేల నుంచి 8.5 కిలోమీటర్ల ఎత్తులో ఆవేశిత రేణువుల తాకిడి పెరిగి, లోహవిహంగాల ఎలక్ట్రానిక్స్‌పై ప్రభావం పడొచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో వేగంగా దూసుకొచ్చే సౌర రేణువులు విమాన ఎలక్ట్రానిక్ వ్యవస్థల్లోకి చొచ్చుకెళ్లే ప్రమాదం ఉంది. ఫలితంగా వాటి మెమరీ వ్యవస్థలోని బిట్‌లలో వైరుధ్యాలు తలెత్తుతాయి. దీన్ని 'బిట్ ఫ్లిప్' అంటారు. దీనివల్ల డేటా కరప్ట్ కావొచ్చు. ఫలితంగా ఎయిర్‌క్రాఫ్ట్‌లోని నేవిగేషన్, కమ్యూనికేషన్, ఫ్లైట్ కంట్రోల్ వ్యవస్థల్లో అవరోధాలు కలగొచ్చు. ఈ నేపథ్యంలో విమానాల డిజైన్‌లో సౌర రేడియోధార్మికతను చాలా ముఖ్యమైన అంశంగా పరిగణిస్తారు.

# వన్డేల్లో అత్యధిక సిక్స్‌ల వీరుడిగా రోహిత్ శర్మ



టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ వన్డేల్లో అత్యధిక సిక్స్‌ల వీరుడిగా నిలిచాడు. రాంచిలో దక్షిణాఫ్రికా, టీమ్ఇండియా మధ్య జరుగుతున్న తొలి మ్యాచ్ దీనికి వేదికైంది. ప్రేనెలన్ సుబ్రాయెన్ బౌలింగ్‌లో (14.1; 14.2) రోహిత్ రెండు వరుస సిక్స్‌లు బాదాడు. ఈ మ్యాచ్ ముందు వరకు రోహిత్ శర్మ ఖాతాలో వన్డేల్లో 349 సిక్స్‌లున్నాయి. ప్రేనెలన్ సుబ్రాయెన్ బౌలింగ్‌లో వచ్చిన రెండు వరుస సిక్స్‌లతో రోహిత్ శర్మ.. పాకిస్థాన్ బ్యాటర్ షాహిద్ అఫ్రిది పేరిట ఉన్న అత్యధిక సిక్స్‌ల (351) రికార్డ్‌ను సమం చేశాడు. అనంతరం మార్కో యాన్సన్ బౌలింగ్‌లో (19.4) బౌలింగ్‌లో అతడు అద్భుతమైన సిక్స్ బాదాడు. దీంతో హిట్‌మ్యాన్ వన్డేల్లో అత్యధిక సిక్స్‌ల (352) వీరుడిగా నిలిచాడు. షహిద్‌అఫ్రిదీ, క్రిస్‌గేల్, సనత్ జయసూర్య, ఎంఎస్ ధోనీ వంటి హేమా హేమీలను వెనక్కి నెట్టి ఈ జాబితాలోఅగ్రస్థానానికి చేరాడు.

**ఆ షాట్ రోహిత్ వజ్రాయుధం..!**

సచిన్ ఆన్ డ్రైవ్, విరాట్ ఎక్స్‌ట్రాకవర్ డ్రైవ్, లక్ష్మణ్ ఫ్లిక్, ధోని హెలికాప్టర్ షాట్లను చాలా కళాత్మకంగా ఆడగలరు. కానీ, రోహిత్ అమ్ములపొదిలో ఓ పవర్ ప్యాక్డ్ షాట్ ఉంది. అదే అతడిని హిట్‌మ్యాన్ చేసింది. అతడి షాట్లలో వజ్రాయుధం లాంటిది. మిగిలిన బ్యాటర్లను ప్రత్యర్థి బౌలర్లు బౌన్సర్లు, షార్ట్‌పిచ్ బాల్స్‌తో భయపెడతారు కానీ.. రోహిత్‌కు ఎట్టి పరిస్థితుల్లో ఆ బంతులు వేయడానికి యత్నించరు. ఎందుకంటే అతడు తన ఫేవరెట్ షాట్‌ను ప్రయోగిస్తే.. బౌలర్ల గణాంకాలు గల్లంతు కావాల్సిందే. రోహిత్ అమ్ములపొదిలోని ఆ శక్తిమంతమైన ఆయుధం పేరు పుల్ షాట్. సమకాలీన వన్డే క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు ఎవరూ ఈ ఒక్కషాట్‌తో బాదనన్ని సిక్సర్లను రోహిత్ కొట్టాడు. ఈఎస్పీన్ గణాంకాల ప్రకారం 20152020 మార్చి వరకు అన్ని ఫార్మాట్లలో కలిపి 570 పుల్ షాట్లు వాడి రోహిత్ 116 సిక్సర్లను మలిచాడు..!ఆ తర్వాత స్థానంలో ఉన్న ఇయాన్ మోర్గాన్ 294 పుల్ షాట్లు ఆడి కేవలం 47 మాత్రమే సిక్సర్లు మార్చగలిగాడంటే రోహిత్ ఏ స్థాయిలో ఈ షాట్‌ను ఆడాడో అర్థం చేసుకోవచ్చు. క్రికెట్ డాట్‌కామ్ ప్రకారం 2010 నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు ఈ షాట్‌తో వన్డేల్లో రోహిత్ కొట్టిన సిక్సర్ల సంఖ్య 127. ఒక్క వన్డేల్లోనే రోహిత్ చేసిన పరుగుల్లో దాదాపు 19 శాతానికిపై దీని నుంచి రాబట్టినవే.

**కలిసొచ్చిన అద్భుతమైన టైమింగ్..**

రోహిత్ ప్రతిస్పందన వేగం మిగిలిన బ్యాటర్లతో పోలిస్తే చాలా వేగంగా ఉంటుంది. దీంతో అతడికి 'ఎక్స్‌ట్రా సెకండ్' ఉంటుందని కామెంటేటర్లు తరచూ చెబుతుంటారు. దీంతో అతడు బంతిని డీప్‌స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీని దాటించేస్తాడు. కింగ్ కోహ్లి సైతం ఈ షాట్ ఆడటానికి కొంత అసౌకర్యంగా ఫీలవుతాడు.. అలాంటిది రోహిత్ మాత్రం అలవోకగా ఆడేస్తాడు.






## రాణించిన రో-కో..
## దక్షిణాఫ్రికా విజయలక్ష్యం 350

రాంచి వేదికగా టీమ్ఇండియా, దక్షిణాఫ్రికా జట్లు మొదటి వన్డేలో తలపడుతున్నాయి. తొలుత టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా జట్టు బౌలింగ్ ఎంచుకుంది. భారత బ్యాటర్లలో విరాట్ కోహ్లి (135; 120 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్స్‌లు) అద్భుతమైన సెంచరీ చేశాడు. రోహిత్ శర్మ (57, 51 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), కేఎల్ రాహుల్ (60; 56 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. కోహ్లీకి వన్డే కెరీర్‌లో ఇది 52వ సెంచరీ. అలాగే అతడు దాదాపు రెండేళ్ల తర్వాత చేసిన సెంచరీ ఇది. విరాట్ ఇంతకు ముందు చివరిసారిగా 15 నవంబర్ 2023లో వన్డే వరల్డ్‌కప్ టోర్నీలో ఆస్ట్రేలియా మీద 117 పరుగులు చేశాడు. రుతురాజ్ గైక్వాడ్ (8), వాషింగ్టన్ సుందర్ (13), అర్షదీప్ సింగ్ (0) విఫలమయ్యారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ క్రీజులోకి వచ్చీరాగానే ఫోర్‌తో ఖాతా తెరిచాడు. క్రీజులో ఉన్నంత సేపు మంచి రిథమ్‌లోనే కనిపించాడు. కానీ దూకుడుగా ఆడే ప్రయత్నంలో జైస్వాల్ (18) నాండ్రే బర్గర్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ డికాక్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. రవీంద్ర జడేజా (32) సమయోచిత ఇన్నింగ్స్ ఆడాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఓట్నీల్ బార్ట్‌మన్, నాండ్రే బర్గర్, మార్కో యాన్సెన్, కోర్బిన్ బాష్ తలో రెండు వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు.

## అహ్మదాబాద్ కామన్వెల్త్ క్రీడలు..
# నిర్వహణ ఖర్చుల అంచనా ఎంతంటే!




గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 2030 కామన్వెల్త్ క్రీడలు నిర్వహించనున్నారు. ఇటీవల కామన్వెల్త్ స్పోర్ట్ సర్వసభ్య సమావేశంలో ఈమేరకు తుది నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో క్రీడల నిర్వహణ కోసం త్వరలో ఓ ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. రూ.3,000 కోట్ల నుంచి రూ.5,000 కోట్ల వ్యయంతో ఈ గేమ్స్‌ను నిర్వహించాలని కమిటీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. మొత్తం ఖర్చు ఖరారు విషయంలో ఇంకా అంచనాలు రూపొందుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. గతంలో 2010లో దిల్లీ కామన్వెల్త్ క్రీడలు నిర్వహించారు. ఇది అనేక వివాదాల్లో చిక్కుకుంది. మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యం, అవినీతి ఆరోపణలు, ప్రాథమిక అంచనాల కన్నా చాలా ఎక్కువ ఖర్చు కావడం వంటివి జరిగాయి. ఈ క్రీడల నిర్వహణకు రూ.635 కోట్లు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. కానీ.. చివరకు రూ.2,600 కోట్లు దాటింది. మౌలిక సదుపాయాలు సహా అన్ని లెక్కలోకి తీసుకుంటే చాలా పెద్ద మొత్తమని తెలిసింది. ఈ అనుభవాల నుంచి గుజరాత్ అవసరమైన పాఠాలు నేర్చుకోనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. డిసెంబర్ లేదా, వచ్చే ఏడాది జనవరి నాటికి నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి. దీన్ని లాభాపేక్ష లేని సంస్థగా నమోదు చేయనున్నారు. 2006 మెల్‌బోర్న్ కామన్వెల్త్ క్రీడల్లో ఇదే నమూనాను విజయవంతంగా ఉపయోగించారు. కమిటీలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సీఈవో, కామన్వెల్త్ స్పోర్ట్, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ తదితర సంస్థల ప్రతినిధులు, నిపుణులు, అథ్లెట్లు కలిపి 1215 మంది సభ్యులుగా ఉండే అవకాశం ఉంది. 15 17 క్రీడాంశాల్లో 2030 అక్టోబరులో ఈ గేమ్స్ నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెప్పారు.




## సిమ్ లేకుండా
## వాట్సప్, టెలిగ్రామ్‌లు పని చేయవు

* **90 రోజుల్లో నిబంధన అమల్లోకి..**



సిమ్ లేకపోయినా వాట్సప్, టెలిగ్రామ్ వాడే వాళ్లు చాలా మంది ఉంటారు. వారందరికీ కేంద్రం షాక్ ఇచ్చింది. కమ్యూనికేషన్ యాప్స్ (వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్, అరట్టై వంటివి) లో దుర్వినియోగాన్ని అరికట్టడానికి కొత్త నిబంధన తీసుకొచ్చింది. ఈ యాప్స్‌నకు సిమ్ కార్డు బైండింగ్‌ను తప్పనిసరి చేస్తూ టెలికాం విభాగం (డాట్) ఆదేశాలు జారీ చేసింది. ఫోన్‌లో సిమ్‌కార్డు లేకపోయినా లేదా సిమ్ తొలగించినా యాప్ సేవలు ఆటోమేటిక్‌గా ఆగిపోతాయి. ఈ నిబంధనలు 90 రోజుల్లో అమల్లోకి రానున్నాయి. యాప్‌ను వెబ్ బ్రౌజర్‌లో ఉపయోగిస్తే, ప్రతి 6 గంటలకు ఒకసారి లాగౌట్ అవుతుంది. మళ్లీ సేవలు పొందాలంటే క్యూఆర్ కోడ్ ద్వారా మొబైల్ సిమ్‌తో లాగిన్ అవ్వాలి. ప్రస్తుతం యాప్ ఇన్‌స్టలేషన్ సమయంలోనే సిమ్‌కార్డును ధ్రువీకరించుకుంటున్నారు. ఒకవేళ సదరు డివైజ్ నుంచి సిమ్‌కార్డును తొలగించినా, డీయాక్టివేట్ చేసినా సేవలు మాత్రం కొనసాగుతున్నాయి. దీంతో ఇతర దేశాల్లో ఉండే సైబర్ నేరగాళ్లు యాప్స్‌ను వినియోగించుకోవడం సాధ్యమవుతోంది. సిమ్ బైండింగ్ నిబంధన వల్ల మోసపూరిత కార్యకలాపాలు తగ్గుతాయని సైబర్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## సూక్ష్మ రుణాలు తగ్గుముఖం

హైదరాబాద్: దేశవ్యాప్తంగా సూక్ష్మ రుణాల జారీ మందగిస్తోంది. కొత్త రుణాల మంజూరు తక్కువగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరు నాటికి 36 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 718 జిల్లాల్లో బ్యాంకులు, మైక్రోఫైనాన్స్ సంస్థలు, ఎన్‌బీఎఫ్‌సీలు (బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు) జారీ చేసిన సూక్ష్మ రుణాల మొత్తం రూ.3,39,510 కోట్లకు దిగివచ్చింది. క్రితం ఏడాది ఇదేకాలం నాటికి ఈ మొత్తం రూ.4,08,049 కోట్లు ఉండటం గమనార్హం. దీంతో పోల్చితే సూక్ష్మరుణాల మొత్తం 16.8 శాతం తగ్గినట్లు తెలుస్తోంది.బిహార్‌లో అధికంగా...: సూక్ష్మ రుణాల మార్కెట్లో మైక్రోఫైనాన్స్ (ఎన్‌బీఎఫ్‌సీ ఎంఎఫ్ఐ) సంస్థలు 39.2 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉన్నాయి. బ్యాంకుల వాటా 31.4 శాతం కాగా, ఎన్‌బీఎఫ్‌సీలకు మిగిలిన వాటా ఉంది. రుణాల జారీలో బిహార్ రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. తదుపరి స్థానాల్లో తమిళనాడు, ఉత్తరప్రదేశ్ ఉన్నాయి. సూక్ష్మరుణాల మొత్తం వరుసగా ఆరో త్రైమాసికంలోనూ తగ్గుముఖం పట్టటం గమనార్హం.

## చాట్‌జీపీటీ @3..
# సెర్చ్ గతిని మార్చిన ఏఐ చాట్‌బాట్

2022 నవంబర్ 30.. చాట్‌జీపీటీ అనే ఒక ఏఐచాట్‌బాట్ పుట్టుకొచ్చింది. చూడ్డానికి వాట్సప్ తరహాలో ఓ విండో.. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతుంటే ఏదో బాట్ అనుకున్నారంతా. కానీ ఆ ఒక్క అడుగు ప్రపంచాన్ని ప్రభావితం చేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేసే తొలి అడుగు అని ఎవరూ ఊహించలేదు. మూడేళ్ల తర్వాత ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే ఆ ఏఐ చాట్‌బాట్ తీసుకొచ్చిన మార్పేమిటో ఇప్పుడు స్పష్టంగా అర్థమవుతోంది. ఒకప్పుడు ఏదైనా సందేహం వస్తే గూగుల్‌ను అడిగేవారు. దానికి వందల లింకులు వచ్చేవి. వాటిలో ఏది క్లిక్ చేయాలో తెలిసేది కాదు. అదే సందేహాన్ని చూసి తెలుసుకోవాలంటే యూట్యూబ్‌లో వందలాది వీడియోలు ప్రత్యక్షమయ్యేవి. పదినిమిషాలు చూస్తే గానీ అది ఉపయోగకరమో కాదో అర్థంకాని పరిస్థితి. స్పష్టంగా చెప్తే గానీ అర్థం చేసుకోలేని అలెక్సా వంటి వాయిస్ అసిస్టెంట్లు మరోవైపు. ఆ సమయంలో అడుగుపెట్టింది చాట్‌జీపీటీ. సెర్చ్




గతిని సమూలంగా మార్చేసింది. 'గూగ్లింగ్' అనేవారు కాస్త 'ఆస్క్ చాట్‌జీపీటీ' అనే స్థాయికి వచ్చారంటే ఇది చూపిన ప్రభావం అలాంటిది మరి!

**తొలి అడుగే గట్టిగా..**

శామ్ ఆల్టమన్‌కు చెందిన ఓపెన్‌ఏఐ విడుదల చేసిన ఈ చాట్‌జీపీటీ అనతికాలంలోనే కోట్లమందికి చేరువైంది. తొలి రెండు నెలల్లోనే 10 కోట్ల మంది యూజర్లను సొంతం చేసుకుంది. 2025 నాటికి 80 కోట్ల యూజర్లకు చేరువైంది. ప్రపంచంలోనే అత్యధికంగా వినియోగించే యాప్‌ల జాబితాలో నిలిచింది. అమెరికాలో దీన్ని అత్యధికంగా వినియోగిస్తుండగా.. భారత్ రెండో అతిపెద్ద మార్కెట్. బ్రెజిల్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.



**గూగుల్ సైతం..**

ఆన్‌లైన్‌లో ఏదైనా వెతకాలంటే ఒకప్పుడు సెర్చ్ ఇంజిన్లే ఆధారం. చాట్‌జీపీటీ ప్రవేశం తర్వాత ప్రజల వెతికే తీరులోనే మార్పు వచ్చింది. ఎవరికైనా తమ వైఫై రౌటర్‌లో సమస్య వస్తే 'ఎలా రిపేర్ చేయాలి' అని గూగుల్‌లో వెతికేవారు. 'అప్పులు ఊబిలోంచి ఎలా బయటపడాలి' వంటి ప్రశ్నలను గూగుల్‌ను అడిగేవారు. ఇప్పుడు ఎలాంటి లింకులూ లేకుండా చాట్‌జీపీటీ అత్యంత వేగంగా సమాధానాలు ఇస్తోంది. దీంతో గూగుల్ వంటి సంస్థలు కూడా సంప్రదాయ సెర్చ్ంజిన్‌కు ఏఐ హంగులు జోడించాల్సి వచ్చింది. తన జెమినైని గూగుల్ సెర్చ్‌లో ఇంటిగ్రేట్ చేసింది. 'ఏఐ ఓవర్‌వ్యూ' పేరుతో సమాధానాలు ఇస్తోంది.

**ఇదీ చాట్‌జీపీటీ గాడి రూల్..**

చాట్‌జీపీటీ దెబ్బకి ఒక్క సెర్చ్ ఇంజిన్ మాత్రమే కాదు.. స్మార్ట్ స్పీకర్లకూ డిమాండ్ క్రమంగా తగ్గుతోంది. అలెక్సా, గూగుల్ హోమ్ వంటి వాయిస్ అసిస్టెంట్ల కొనుగోళ్లు తగ్గుతున్నట్లు ఓ నివేదిక తెలిపింది. చాట్‌జీపీటీ వంటి ఎన్నో చాట్‌బాట్‌లు వచ్చినా యూట్యూబ్ మాత్రం బలంగా నిలదొక్కుకుంది. అయితే, యూట్యూబ్ చూసే తీరుతెన్నులూ మారుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. తొలుత చాట్‌జీపీటీ వంటి ఏఐచాట్‌బాట్‌లను సమాచారం అడిగి.. అదెలా ఫిజికల్‌గా చేయాలో తెలుసుకునేందుకు మాత్రమే యూట్యూబ్‌కు వస్తున్నారట. చాట్‌జీపీటీ లాంచ్ అయిన వెంటనే నిపుణులు ఏఐ వల్ల లక్షలాది ఉద్యోగాలు పోతాయని అంచనా వేశారు. దీని ప్రభావం మొదలైంది. వెబ్ డెవలపర్లు, అనువాదకులు, అమెరికన్ కాలేజీ విద్యార్థుల కోసం ఎస్సేలు రాసే కెన్యా ఫ్రీలాన్సర్లు దీని కారణంగా దెబ్బతిన్నారు. కొలంబియాలో 85% న్యాయమూర్తులు ఉచిత చాట్‌జీపీటీ లేదా మైక్రోసాఫ్ట్ కోపైలట్ ఉపయోగించి కేసులు త్వరగా ముగిస్తున్నారట. మాలిలో ఒక ఏఐ ప్రాజెక్ట్‌స్థానిక భాషల్లో పాఠ్యాంశలను అనువదించి చిన్న పిల్లలు త్వరగా నేర్చుకోవడానికి, స్కూలు డ్రాపౌట్లను తగ్గించడానికి సహాయపడుతోందని మరో నివేదిక పేర్కొంది. దక్షిణ కొరియాలో చాట్‌జీపీటీ ఆధారిత రోబోలు వచ్చాయి. ఇవి వృద్ధులకు సహచరులుగా ఉంటున్నాయి. వారితో సంభాషించడం, మందులు వేసుకోవాలని గుర్తు చేయడం వంటి పనులు చేస్తున్నాయి. అత్యవసర సమయాల్లో కుటుంబ సభ్యులకు అలర్ట్ చేస్తున్నాయి. 2024లో 50పైగా దేశాలు ఎన్నికలకు వెళ్లాయి. భాషా అడ్డంకులు దాటి ఓటర్లను చేర్చడానికి చాట్‌జీపీటీ వంటి ఏఐ చాట్‌బాట్‌లు ప్రచార బృందాలు పెద్దఎత్తున వినియోగించాయి.

# సినిమా

## ఓటీటీలో పాంచ్ మినార్

[illegible]




## జంట షికారు

[illegible]



## జ్ఞాపకాలు సజీవం




[illegible]

## అందుకే ఆఫర్లు తిరస్కరిస్తున్నా..

సౌత్ ఇండస్ట్రీపై

## సునీల్ శెట్టి వ్యాఖ్యలు

బాలీవుడ్ నటులను దక్షిణాది ఫిల్మ్ మేకర్స్ విలన్ పాత్రలకే



పరిమితం చేస్తున్నారని సునీల్ శెట్టి పేర్కొన్నారు. అలా చేయడం ఇష్టం లేదని, అందుకే సౌత్ ఇండస్ట్రీ నుంచి ఆఫర్లు వస్తే తిరస్కరిస్తున్నానని తెలిపారు. తాజాగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ''హిందీ నటులను శక్తిమంతమైన విలన్లుగా చూపిస్తూ అక్కడ హీరోలను హైలైట్ చేయాలని ఫిల్మ్‌మేకర్స్ భావిస్తుంటారు. స్క్రీన్ ప్రెజెన్స్ బాగుంటుందని, అది ప్రేక్షకులకు నచ్చుతుందని వారు అనుకుంటుంటారు. కానీ, అది నాకు ఇష్టం ఉండదు. రజనీకాంత్‌తో కలిసి నటించాలనే డ్రీమ్ కారణంగానే 'దర్బార్'ను అంగీకరించారు. ప్రాంతీయ సినిమాలను సపోర్ట్ చేయాలనే ఉద్దేశంతోనే తుళు మూవీ 'జై'లో నటించా'' అని వివరించారు.

## 100 సినిమాల హీరో వద్ద..


## రూ.3 కోట్లు ఉండవా?



హైదరాబాద్: తెలుగు ప్రేక్షకుల ఆదరణ మరిచిపోలేదని, వారి అభిమానమే తనను కింగ్‌లా ఫీలయ్యేలా చేసిందని కన్నడ నటుడు ఉపేంద్ర అన్నారు. తాను కీలక పాత్ర పోషించిన 'ఆంధ్ర కింగ్ తాలూకా' సక్సెస్ మీట్‌లో మాట్లాడారు. ''నిన్నో, మొన్నో ఈ సినిమా కథా చర్చలు జరిగినట్టు అనిపిస్తోంది. ఈ స్క్రిప్ట్ విన్నప్పుడే థ్రిల్ అయ్యా. 'మీరు ఆంధ్ర కింగ్‌గా కనిపిస్తారు?' అని మేకర్స్ చెప్పగానే కాస్త టెన్షన్ పడ్డా. కానీ, తర్వాత అది మాయమైంది. నేనెప్పుడు ఇక్కడికి (తెలుగు రాష్ట్రాలు) వచ్చినా ఓ కింగ్‌లా ఫీలవుతా. మీరు నాపై చూపే ప్రేమ, అభిమానమే అందుకు కారణం. 25 ఏళ్ల నుంచి అదే అనుభూతి పొందుతున్నా'' అని పేర్కొన్నారు. ఓ అభిమాని బయోపిక్‌గా దర్శకుడు పి. మహేశ్‌బాబు తెరకెక్కించిన ఈ సినిమాలో రామ్ పోతినేని హీరోగా నటించిన సంగతి తెలిసిందే. ఉపేంద్రకు వీరాభిమానిగా రామ్ వినోదం పంచుతూనే ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేశారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. సినిమా గురువారం విడుదల కాగా.. తాజాగా సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఉపేంద్రతోపాటు దర్శకుడు మహేశ్, సంగీత ద్వయం వివేక్ మెర్విన్, నిర్మాత రవిశంకర్ పాల్గొన్నారు.

## 'పెళ్లికి ఎక్స్‌పైరీ డేట్'..

తన వ్యాఖ్యలపై



## స్పందించిన కాజోల్

బాలీవుడ్ నటి కాజోల్ ఇటీవల 'టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్' షోలో చేసిన వ్యాఖ్యలు విమర్శలకు దారితీసిన విషయం తెలిసిందే. 'పెళ్లికి ఎక్స్‌పైరీ డేట్ ఉంటే ఎక్కువ కాలం బాధ పడాల్సిన అవసరం ఉండదు' అని కాజోల్ సరదాగా అన్నారు. ఈ వ్యాఖ్యలపై ఆమె విమర్శలు ఎదుర్కొన్నారు. తాజాగా వీటిపై స్పందించారు. తాజా ఎపిసోడ్‌లో ఈ విషయం చర్చకి వచ్చింది. అప్పుడు కాజోల్ స్పందిస్తూ.. 'మనం రెండో విభాగంలోకి వెళ్దాం. మనల్ని ఇబ్బందుల్లోకి నెట్టిన విభాగమది. దయచేసి సరదా సంభాషణల్లో భాగంగా చేసే వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోకండి' అని కామెంట్ చేశారు. దీనికి ట్వింకిల్ రియాక్ట్ అయ్యారు. 'ఈ కార్యక్రమంలో మాట్లాడే వాటిని సీరియస్‌గా తీసుకోవద్దు అని మనం మొదటి ఎపిసోడ్ నుంచే డిస్‌క్లైమర్ ఇస్తూనే ఉన్నాం. మళ్లీ చెబుతున్నాం.. మేం చెప్పే సలహాలు పాటించకండి'' అని అన్నారు. బాలీవుడ్

## మరో వంద జన్మలైనా.. అలాగే పుట్టాలని కోరుకుంటా

### : రజనీకాంత్

ప్రముఖ నటుడు రజనీకాంత్‌కు మరో గౌరవం దక్కింది. నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న ఆయన్ను 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా' (ఇఫి) ముగింపు వేడుకలో సత్కరించారు. కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ , గోవా సీఎం ప్రమోద్ సావంత్ శాలువాతో రజనీకాంత్‌ను సత్కరించి, జ్ఞాపిక అందించారు. అనంతరం రజనీకాంత్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. "నటుడిగా 50 ఏళ్ల నా ప్రయాణాన్ని తలచుకుంటే.. పదేళ్లో, పదిహేనేళ్లో గడిచినట్లుగా అనిపిస్తోంది. ఒకవేళ మరో 100 జన్మలైనా.. రజనీకాంత్‌లాగే పుట్టాలనుకుంటున్నా" అని పేర్కొన్నారు. గోవా వేదికగా జరిగిన 'ఇఫి' వేడుకకు కుటుంబంతో కలిసి రజనీకాంత్ హాజరయ్యారు. ఈ ఫ్యామిలీ ఫొటో నెట్టింట అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. తొమ్మిది రోజుల పాటు జరిగిన ఈ వేడుకలో 13 వరల్డ్ ప్రీమియర్స్, 5 ఇంటర్నేషనల్ ప్రీమియర్స్, 44 ఏషియన్ ప్రీమియర్స్ ప్రదర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్తమ పరిచయ దర్శకుడు కేటగిరీలో బాలీవుడ్ డైరెక్టర్ కరణ్ సింగ్ త్యాగి (కేసరి ఛాప్టర్ 2)కి అవార్డు దక్కింది. ఈ నెల 20న ప్రారంభమైన 56వ 'ఇఫి' ఈవెంట్‌లో నందమూరి బాలకృష్ణను సత్కరించిన సంగతి తెలిసిందే. బాలయ్య కూడా నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.